




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348


# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు







| బుధవారం10 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 008 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## అంతర్జాతీయ గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 10, ప్రతినిధి: బ్యాంకాక్-భారత్ మార్గంలో సాగుతున్న అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణా ముఠాను తెలంగాణ ఈగల్ టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సంయుక్త ఆపరేషన్‌లో బట్టబయలు చేశాయి. మహిళా జూనియర్ ఆర్టిస్టులను ఉపయోగించి డ్రగ్స్ స్మగ్లింగ్ నిర్వహిస్తున్న ముఠాకు సంబంధించిన హైదరాబాద్‌కు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరికళ బ్యాంకాక్ నుంచి డ్రగ్స్‌తో వస్తుండగా కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి వద్ద నుంచి సుమారు 2.15 కిలోల ఓజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కేరళకు చెందిన ఇద్దరు ప్రధాన సూత్రధారులను అధికారులు గుర్తించినట్లు వెల్లడించారు. ముఠాలో రాజు బిశ్వాస్ అనే వ్యక్తి కీలకపాత్ర పోషిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు చర్యలు ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.

## అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపనలు



సందేశం టైమ్స్, భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 10, ప్రతినిధి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి దమ్మపేట మండలంలోని కట్కూరు, వీరభద్రునిగుంపు, పట్వారిగూడెం, మద్దులగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆత్మీయ కానుకలను అందజేశారు. పట్వారిగూడెం గ్రామంలో రాజుపల్లి గ్రామానికి చెందిన 38 మంది డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం రూ.2.22 కోట్ల వ్యయంతో పట్వారిగూడెం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి పాకలగూడెం వరకు బీటీ రోడ్డుకు, రూ.1.93 కోట్లతో మొద్దులగూడెం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి రెడ్డాలపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## ఏసీబీ దాడుల్లో ఆర్ అండ్ బి ఇంజినీర్ ఇన్ చీఫ్ వద్ద భారీ అక్రమాస్తులు వెలుగులోకి

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 10, ప్రతినిధి: అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన దాడుల్లో ఆర్ అండ్ బి శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ మోహన్ నాయక్‌కు చెందిన భారీ అక్రమాస్తులు వెలుగులోకి వచ్చాయి. సుమారు రూ.200 కోట్ల విలువైన ఆస్తులను అధికారులు గుర్తించినట్లు సమాచారం. దాడుల సందర్భంగా 2.5 కిలోల బంగారు బిస్కెట్లు, భారీ మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.1.5 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించగా, నివాసంలో రూ.50 లక్షల నగదును సీజ్ చేశారు. విలువైన స్థిరాస్తులు, ఇతర ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు కూడా లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే ప్రక్రియ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.



## మరోసారి నెత్తురోడిన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్

సందేశం టైమ్స్, ఇస్లామాబాద్, జూన్ 10, ప్రతినిధి: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవామీ యాక్షన్ కమిటీపై పాకిస్థాన్ ప్రభుత్వం విధించిన నిషేధానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున ప్రజలు నిరసనలకు దిగగా పరిస్థితి హింసాత్మకంగా మారింది. నిరసనకారులపై పాకిస్థాన్ సైన్యం కాల్పులు జరపడంతో సుమారు 30 మంది మృతి చెందినట్లు, 200 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. పీవోకే ప్రాంతంలోని పలు పట్టణాల్లో ఆందోళనలు ఉధృతమవగా భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న సైన్యం పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు స్థానిక వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనతో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తత మరింత పెరిగింది.



## ఉజ్వల యోజన లబ్ధిదారులకు కేంద్రం షాక్.. సబ్సిడీ సిలిండర్లు 9 నుంచి 4కు కోత

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, జూన్ 10, ప్రతినిధి: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద పేద కుటుంబాలకు అందిస్తున్న సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం తగ్గించిన వార్తలు నిజమేనని తాజా అధికారిక సమాచారం ద్వారా స్పష్టమైంది. ఇప్పటివరకు సంవత్సరానికి తొమ్మిది సబ్సిడీ సిలిండర్లు అందిస్తున్న కేంద్రం, ఇకపై కేవలం నాలుగు రీఫిల్‌లకు మాత్రమే రూ.300 చొప్పున సబ్సిడీ అందించనున్నట్లు వెల్లడైంది. గతంలో ఈ పథకం ప్రారంభ దశలో ఏడాదికి 12 సిలిండర్ల వరకు సబ్సిడీ ఉండగా, తర్వాత దానిని తొమ్మిదికి తగ్గించారు. తాజాగా మరింత కోత విధిస్తూ నాలుగుకు పరిమితం చేశారు. ఇదే సమయంలో 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధరపై రూ.29 పెంపు కూడా అమల్లోకి వచ్చింది. పెరుగుతున్న ఇంధన వ్యయాలు, ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు వస్తున్న నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర పెట్రోలియం శాఖ అధికారులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 10.5 కోట్ల ఉజ్వల యోజన లబ్ధిదారులు ఈ నిర్ణయంతో ప్రభావితమయ్యే అవకాశం ఉందని సమాచారం.

## విశాఖ స్టీల్ ప్లాంట్ విషాదం.. ఘటనాస్థలాన్ని సందర్శించిన కేంద్ర, రాష్ట్ర నేతలు



సందేశం టైమ్స్, అమరావతి/విశాఖపట్నం, జూన్ 10, ప్రతినిధి: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాద ఘటన అత్యంత విషాదకరమని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ భరత్‌లతో కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గాయపడిన కార్మికులను పరామర్శించి వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మరోవైపు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, విశాఖ జిల్లా కలెక్టర్ మరియు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రమాదంలో 8 మంది మరణించగా, 6 మంది గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ సీఎంకు వివరించారు. మృతుల్లో ఐదుగురు శాశ్వత ఉద్యోగులు, ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించినట్లు వెల్లడించారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో ఫోన్‌లో మాట్లాడిన చంద్రబాబు బాధిత కుటుంబాలకు తగిన సహాయం అందించాలని కోరారు.

జాతీయ తెలుగు దినపత్రిక

సందేశం టైమ్స్

బుధవారం10 జూన్ 2026



## వట్‌పల్లి మండలంలో 31 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 10, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గంలోని వట్‌పల్లి మండలంలో 31 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.10,87,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వట్‌పల్లి మండల అధ్యక్షుడు ప్రతాప్ రమేష్ జోషి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, వట్‌పల్లి గ్రామ అధ్యక్షుడు దిగంబర్ రావు, వెంకట్ పాటిల్, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్, శివచరణ్, నాగయ్య, పత్రి విట్టల్, పెద్దన్న, హబీబ్ మియా, సత్యం, వీరన్న, సురేష్, బసవరాజ్, అరవింద్, వీరారెడ్డి, నారాయణ గౌడ్, మైపాల్ రెడ్డి, పాషా, ప్రవీణ్ గౌడ్, రాహుల్, డి. ఇస్మాయిల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గండిగూడెం చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు.. కాలుష్య జలాల నివారణకు ప్రత్యేక కాలువ నిర్మాణం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 10, జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్పూర్ డివిజన్ పరిధిలో గల గండిగూడెం చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం చెరువులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులోకి పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు చేరకుండా ప్రత్యేక కాలువ నిర్మించనున్నట్లు వెల్లడించారు. చెరువు అలుగు పెరగడంతో సమీప ఖాజిపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలంలో నీటిమట్టం పెరిగి ఇళ్లలోకి నీరు చేరుతోందని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అలుగు మట్టాన్ని పూర్వస్థితికి తీసుకురావడంతో పాటు కాలుష్య జలాలను చెరువు వెలుపలికి మళ్లించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిశ్రమలు కాలుష్య జలాలను విడుదల చేయకుండా కఠిన చర్యలు అమలు చేస్తామని హెచ్చరించారు. గండిగూడెం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, రాజు, గణేష్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 10, జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల సమన్వయ కర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు నియమించిన పార్టీ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇంచార్జి చంద్ర గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సభ్యత్వ నమోదు ఇంచార్జి చంద్ర గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమన్వయ కర్తలతో విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇంచార్జి చంద్ర గౌడ్ మాట్లాడుతూ ఈసారి డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసి పార్టీ బలాన్ని చాటాలని సూచించారు. ఈ సమావేశంలో పట్టణ, మండల సమన్వయ కర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విశ్రాంతి ఉద్యోగులు నా కుటుంబ సభ్యులే ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 10, బి. డేవిడ్: పటాన్చెరు నియోజకవర్గం రామచంద్రాపురం పరిధిలోని ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులు తన కుటుంబ సభ్యులలాంటి వారని, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తానని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రామచంద్రాపురం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు హాజరయ్యారు. ఇటీవల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాశి, అయోధ్య, ఢిల్లీ, బెంగళూరు, మైసూర్, ఊటీ తదితర విహారయాత్రలకు ఆర్థిక సహకారం అందించిన ఎమ్మెల్యే దంపతులను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా విశ్రాంతి ఉద్యోగుల సంఘంతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి విశ్రాంతి ఉద్యోగులు అందిస్తున్న సూచనలు, సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. వారి సంక్షేమం కోసం సహకారం అందించడంతో పాటు సమావేశాలు నిర్వహించేందుకు భవన నిర్మాణానికి కూడా సహాయం చేసినట్లు గుర్తు చేశారు. తాను పదవిలో ఉన్నా లేకున్నా పెన్షనర్లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

## మహిళా శక్తి మహాసభకు నారాయణఖేడ్, కాంగ్టి మహిళల తరలింపు.. నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి




సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 10, జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ పట్టణ కేంద్రంలో ఇందిర మహిళా శక్తి పథకం ఆధ్వర్యంలో నూతన బస్సులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. నారాయణఖేడ్ మండల మహిళా సమైక్య సంఘం, కాంగ్టి మండల జననీ మహిళా మండల సమాఖ్యల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మహిళా శక్తి మహాసభకు సుమారు 100 మంది మహిళా సమాఖ్యల ప్రతినిధులు, మహిళలు ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి బస్సుల నిర్వహణను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా టీజీఎస్ఆర్టీసీకి అప్పగించే చారిత్రాత్మక కార్యక్రమానికి సంఘీభావంగా ఈ పర్యటనను నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 553 బస్సులను టీజీఎస్ఆర్టీసీకి అప్పగించడం మహిళా సాధికారతలో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు, ఆర్థిక బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను స్వయం సమృద్ధులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో మహిళా సంఘాలకు మరిన్ని రాయితీలు, ఆర్థిక సహాయాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## వత్సవాయి మండలం మక్కపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి



సందేశం టైమ్స్, వత్సవాయి, జూన్ 10, ప్రతినిధి: వత్సవాయి మండలం మక్కపేట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా బోనకల్ మండలానికి చెందిన మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం లారీని ఓవర్‌టేక్ చేయబోయిన సమయంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ లారీ కింద పడటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మృతురాలిని బోనకల్ మండలం పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన గొర్రెముచ్చు ప్రమీలగా పోలీసులు గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎఫ్ఎల్ఎన్ అమలులో ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలదే కీలకపాత్ర: కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్, జూన్ 10, నియోజకవర్గ ప్రతినిధి: జిల్లాలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) అమలులో ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులదే కీలకపాత్ర అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎఫ్ఎల్ఎన్ ఫలితాల మెరుగుదలపై జిల్లా వార్షిక ప్రణాళిక వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, ఏసీజీఈ కరుణాకర్, సీఎంఓ రాజు, ఏఎస్‌వో నవీన్, మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బేస్‌లైన్ అసెస్‌మెంట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించి డిసెంబర్ నాటికి వాటిని మెరుగుపర్చాలని సూచించారు. కృత్రిమ మేధ ఆధారిత అభ్యసనాన్ని ప్రోత్సహించాలని, పాఠశాలల్లో కనీస సామర్థ్యాలు సాధించేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలను నిబంధనల మేరకు క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతో పాటు ఉపాధ్యాయుల పనితీరు, తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్య అందించడంలో ఎఫ్ఎల్ఎన్ కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యాస పురోగతి పర్యవేక్షణ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల బలోపేతం, ఉపాధ్యాయుల సామర్థ్యాభివృద్ధి, పాఠ్యపుస్తకాలు మరియు వర్క్‌బుక్స్ సకాలంలో అందుబాటులో ఉంచే చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కేరాఫ్ అడ్రస్ ప్రభుత్వ పాఠశాలలే: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, జూన్ 10, నియోజకవర్గ ప్రతినిధి: విద్యారంగంలో మెదక్ జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్యే ప్రధాన మార్గమని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం ఐఐఐటీ ప్రవేశాలకే పరిమితం కాకుండా దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎయిమ్స్ వంటి వైద్య కళాశాలల్లో సీట్లు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలతో కృషి చేస్తే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. జిల్లా వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 91 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్ఎస్‌సీలో 560కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ఎగ్జిక్యూటివ్ ఫైల్స్, డిక్షనరీలు, పెన్నులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, కరుణాకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజు, సహాయ గణాంక అధికారి నవీన్, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎమ్మార్పీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాకినాడలో బూత్ స్థాయి ఓటర్ సమగ్ర సర్వేపై బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 10, ప్రతినిధి: కాకినాడ సిటీ ఈస్ట్ మండలం అధ్యక్షులు గాలి దేవర శేఖర్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జిల్లా సెక్రటరీ జ్యోతుల రాజేష్ గారి స్వగృహంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ సమగ్ర సర్వేపై విస్తృతంగా చర్చించారు. బూత్ స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికి వెళ్లి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన అవసరాన్ని నేతలు వివరించారు. 2019–2024 ఓటర్ జాబితా ఆధారంగా ప్రతి ఓటు వివరాలను సమగ్రంగా పరిశీలించి ఎటువంటి ఓటు కూడా తొలగింపుకు గురికాకుండా కాపాడుకోవాలని సూచించారు. చనిపోయిన ఓట్లు, వలస వెళ్లిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓట్లను డేటా ఆధారంగా గుర్తించి ఎన్నికల సంఘానికి సరైన సమాచారం అందించాలన్నారు. ఆధార్ అనుసంధానం కాని వివరాలు, అసమగ్ర డేటాను సరిచేయడంలో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర కీలకమని నేతలు పేర్కొన్నారు. ఈ సర్వే ఎన్నికల సంఘం పర్యవేక్షణలో జరుగుతున్న ముఖ్యమైన ప్రక్రియ అని, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గట్టి సత్యనారాయణ, దువ్వూరి సుబ్రహ్మణ్యం, యెనిమిరెడ్డి మాలకొండయ్య, ఏడిద కృష్ణ, మచ్చ శివ, శ్రీహరి, మొనగాల సాయి, గోపి, సదా నాని, హరి, సుబ్రహ్మణ్యం, బొక్క బుజ్జి, నరుకుర్తి మూర్తి, నూక పిడుగుల తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో 95 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి.. రైతులకు రూ.708.04 కోట్ల చెల్లింపులు: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, జూన్ 10, నియోజకవర్గ ప్రతినిధి: జిల్లాలో 95 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 84,531 మంది రైతుల నుంచి 3,85,122.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఇందులో 66,900 మంది రైతులకు రూ.708.04 కోట్ల చెల్లింపులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మొత్తం 311 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు కలెక్టర్ తెలిపారు.అకాల వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.



## సంగారెడ్డి జిల్లాలో మొసలి పిల్లల కలకలం

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 10, ప్రతినిధి: ఉమ్మడి మెదక్ జిల్లా సదాశివపేట మండలం మెలిగిరిపేట గ్రామ శివారులో పంట పొలాల్లో ఒకేసారి 20 మొసలి పిల్లలు కనిపించడంతో గ్రామంలో కలకలం రేగింది. సోమవారం పశువులను మేతకు తీసుకెళ్లిన కాపరులకు పొలాల మధ్య మొసలి పిల్లలు కనిపించగా వారు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు మొసలి పిల్లలను సురక్షితంగా పట్టుకుని సమీప ప్రాంతంలో సుమారు 60 మొసలి గుడ్లను కూడా గుర్తించారు. అనంతరం మొసలి పిల్లలు, గుడ్లను సంగారెడ్డి సమీపంలోని మంజీరా అభయారణ్యంలోని మొసళ్ల సంరక్షణ కేంద్రానికి తరలించారు. సమీపంలోని చెరువులు, మెలిగిరిపేట ప్రాజెక్టులో పెద్ద సంఖ్యలో మొసళ్లు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతుండగా, ఈ ఘటనతో రైతులు, గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



## జూన్ 20న పదవ తరగతి ప్రతిభావంతులకు పురస్కారాల పంపిణీ – 500 మంది విద్యార్థులకు సైకిళ్లు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 10, ప్రతినిధి: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన పురస్కారాలు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన సుమారు 500 మంది విద్యార్థులకు సైకిళ్లు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం పరీక్షల సమయంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణలు, పరీక్ష సామాగ్రి అందించడంతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు పురస్కారాలు ఇస్తున్నామని, ఈ సంవత్సరం వినూత్నంగా సైకిళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పటాన్‌చెరు మైత్రి మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 10, ప్రతినిధి: పుల్కల్ మండల కేంద్రంలోని పుల్కల్ రైతు వేదిక నందు అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. పుల్కల్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో అర్హత పొందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఎమ్మార్వో కృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు దుర్గారెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



## పాలేరు ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తాం – మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 10, ప్రతినిధి: పాలేరు ప్రాంతాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసి రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందిన వ్యవసాయ ప్రాంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) శాఖను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సిపి సునీల్ దత్ తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతులకు అందుబాటులో బ్యాంకింగ్ సేవలు ఉండాలనే లక్ష్యంతో కొత్త శాఖను ప్రారంభించామని, సహకార బ్యాంకులు గ్రామీణ ప్రజలకు కీలక ఆర్థిక సేవలు అందిస్తున్నాయని తెలిపారు. పాలేరు నియోజకవర్గానికి అత్యుత్తమ సాగునీటి వసతులు ఉన్నాయని, సీతారామ ప్రాజెక్టు, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి జలాలు ఈ ప్రాంతాన్ని మరింత సస్యశ్యామలం చేయనున్నాయని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో దాదాపు లక్ష కోట్ల రూపాయలు జమ చేశామని, దేశంలోనే అతిపెద్ద రుణమాఫీగా 20 వేల కోట్ల రూపాయలు అమలు చేశామని తెలిపారు. వర్షపాతం మార్పులకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘురాం రెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, సిపి సునీల్ దత్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు.

## పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ నిర్వహణ: అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్, జూన్ 10, ప్రతినిధి: మెదక్ జిల్లా ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో మహాత్మ జ్యోతిబాపూలే స్కూల్స్, కాలేజీలకు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పండ్లు, కూరగాయలు, చికెన్, మటన్ సరఫరా, శానిటేషన్ సిబ్బంది, క్యాటరింగ్ వంటి అంశాలపై టెండర్ ప్రక్రియ అదనపు కలెక్టర్ నగేష్ చైర్మన్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా టెండర్ల ప్రక్రియలో పారదర్శకతను కచ్చితంగా పాటించాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్‌సీఓ విరేశం, డీఈఓ హరిబాబు, వివిధ పాఠశాలలు, కాలేజీల ప్రిన్సిపాళ్లు, కమిటీ సభ్యులు, టెండర్ దారులు హాజరయ్యారు. టెండర్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## నేటి అల్లాదుర్గం.. ఆనాటి శీర్ధనకోట



సందేశం టైమ్స్, మెదక్, జూన్ 10, ప్రతినిధి: అల్లాదుర్గం ఒకప్పుడు శీర్ధనకోటగా ప్రసిద్ధి చెందిన చారిత్రక ప్రాంతమని ప్రముఖ పరిశోధకుడు అక్కడ భీమన్న శాస్త్రులు తెలిపారు. ఈ ప్రాంతంలోని చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే సంకల్పంతో ఆయన పురావస్తు అవశేషాలను సేకరిస్తూ చరిత్రాభిమానులను ఆకట్టుకుంటున్నారని పేర్కొన్నారు. అల్లాదుర్గంలో 1967లో జరిగిన తవ్వకాలలో వెలుగుచూసిన మెట్ల ఆకారంలోని కుండచిత్రాలు ప్రస్తుతం మ్యూజియంలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ పురావస్తు అవశేషాలు ఆనాటి నాగరికతకు, సంస్కృతికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయని ఆయన వివరించారు.

## మర్యాదపూర్వకంగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిని కలిసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు



సందేశం టైమ్స్, జూన్ 10, ప్రతినిధి: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ గారిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ నూతి సత్యనారాయణ గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవహారాలు, సంస్థాగత బలోపేతంపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసే దిశగా సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

## ఇసుక అక్రమ రవాణా కేసులో కీలక నిందితుడు అరెస్ట్ – ఏసీపీ సారంగపాణి

సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 10, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ నుండి ఖమ్మం జిల్లాకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన కీలక నిందితుడిని చింతకాని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు. జూన్ 5న కంచికచర్ల ప్రాంతం నుండి టిప్పర్ల ద్వారా ఇసుక తరలింపు సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతకాని మండలానికి చెందిన మాతంగి నాగరాజు (34) మృతి చెందిన ఘటనపై విచారణ జరిపిన పోలీసులు, ఈ కేసులో ప్రధాన నిర్వాహకుడిగా ఖమ్మం నగరం రమణగుట్ట ప్రాంతానికి చెందిన లారీ యజమాని దేవేందర్ (35) ను గుర్తించి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అతడిని న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించిందని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని, వైరా డివిజన్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేస్తామని ఏసీపీ హెచ్చరించారు.

## ఆడబిడ్డల వివాహాలకు అండగా GMR ఫౌండేషన్ సేవలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 10, ప్రతినిధి: నారాయణఖేడ్ మండలం అంత్వార్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందుల మధ్య కుమార్తె వివాహం నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న జిఎంఆర్ ఫౌండేషన్, ఆ కుటుంబానికి వివాహ సహాయాన్ని అందించి అండగా నిలిచింది. జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుర్రపు మచ్చేందర్ గారి ఆదేశాల మేరకు ఈ సహాయం అందజేయబడింది. దివంగత జైరాజ్–లక్ష్మీ దంపతుల కుమార్తె వివాహానికి అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా కుటుంబానికి భరోసాగా నిలిచిన జిఎంఆర్ ఫౌండేషన్ సేవలను గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు తుకారాం, పర్వయ్య, యాదన్న, పాపయ్య, వీరేశం తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసా కల్పించడమే తమ లక్ష్యమని ప్రతినిధులు పేర్కొన్నారు.




## చింతకాని ఎస్ఐగా జి. నరేష్ బాధ్యతల స్వీకరణ

సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 10, ప్రతినిధి: చింతకాని పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి. నరేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్ఐగా పనిచేసిన వీరేందర్‌ను హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన జి. నరేష్ ఇంతకు ముందు రఘునాథపాలెం ఎస్ఐగా సేవలు అందించారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రజలు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే అక్రమ ఇసుక రవాణా, రేషన్ బియ్యం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నల్ల పోచమ్మ అమ్మవారికి 480 గ్రాముల వెండి కిరీటం సమర్పణ



సందేశం టైమ్స్, మనూర్, జూన్ 10, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి హైదరాబాద్ బేగంబజార్‌కు చెందిన బాలాజీ–కళావతి దంపతులు తమ కుటుంబ సభ్యులు అశ్విని, నరేందర్, లావణ్య, రవీందర్‌లతో కలిసి మొక్కుబడి రూపంలో 480 గ్రాముల వెండి కిరీటాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు భక్తుల కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో కుటుంబం వర్ధిల్లాలని ఆశీర్వదించారు. వెండి కిరీటం సమర్పణ విషయాన్ని ఆలయ ఈవో శివ రుద్రప్పకు తెలియజేయగా, భక్తిశ్రద్ధల నడుమ జరిగిన ఈ కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

## వరి ధాన్యం నిల్వతో రైతు ఆత్మహత్యాయత్నం – అడ్డుకున్న స్థానికులు





సందేశం టైమ్స్, మెదక్, జూన్ 10, ప్రతినిధి: మెదక్ జిల్లా కొల్చారం మండలం పైత్ర గ్రామంలో వరి ధాన్యం నిల్వలు ఉండటంతో రైతు మనస్థాపానికి గురై రంగంపేట సొసైటీ ఎదుట ఆందోళనకు దిగిన ఘటన చోటుచేసుకుంది. పైత్ర గ్రామానికి చెందిన రైతు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా, అక్కడే ఉన్న సొసైటీ డైరెక్టర్ మరియు స్థానికులు వెంటనే స్పందించి అతడిని అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వరిధాన్యం తరలింపులో జాప్యం జరుగుతుండటంతో తీవ్ర ఆవేదనకు గురైన రైతులు, తక్షణమే లారీలను పంపించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను కోరుతున్నారు. లేనిపక్షంలో రైతులందరూ కలిసి రంగంపేట రోడ్డుపై వంటావార్పు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

## మమతా బెనర్జీకి వరుస ఎదురుదెబ్బలు సంతకాల ఫోర్జరీ కేసులో సీఐడీ విచారణ

సందేశం టైమ్స్, జూన్ 10, ప్రతినిధి: సంతకాల ఫోర్జరీ కేసు ఆరోపణల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసానికి సీఐడీ అధికారులు చేరుకుని విచారణ చేపట్టారు. ప్రతిపక్ష నేత హోదా కోసం ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు మమతాపై ఆరోపణలు రావడంతో ఈ కేసులో విచారణ వేగవంతమైంది. ఆరోపణల ఆధారంగా సీఐడీ బృందం మమతా బెనర్జీ ఇంటికి వెళ్లి సంబంధిత వివరాలు సేకరించినట్లు సమాచారం.

## లీటర్‌పై రూ.20 డిస్కౌంట్ – కొత్త ఈ-85 ఇంధన స్టేషన్ ప్రారంభం




సందేశం టైమ్స్, జూన్ 10, ప్రతినిధి: దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఇంధన విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీలో సరికొత్త 'ఈ-85 ఫ్యూయల్ స్టేషన్'ను ఇటీవల ప్రారంభించారు. ఈ ఇంధన విధానం ద్వారా లీటర్‌పై సుమారు రూ.20 వరకు ధర తగ్గింపు లభిస్తుందని అధికారులు తెలిపారు. పర్యావరణహిత ఇంధన వినియోగాన్ని పెంపొందించడంతో పాటు ప్రజలకు తక్కువ ఖర్చుతో ఇంధనం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

## అవినీతిపై బహిరంగ చర్చలకు సిద్ధమేనా? – కోదాడ కాంగ్రెస్ నేతల సవాల్



సందేశం టైమ్స్, సూర్యాపేట, జూన్ 10, ప్రతినిధి: కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కోదాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కోదాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకే మాజీ ఎమ్మెల్యే రాజకీయ అక్కస్సుతో ఆరోపణలు చేస్తున్నారని వారు విమర్శించారు. ఇటీవల మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిరంగంగా నిరూపించాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి లేదా అధికారులకు ముడుపులు అందుతున్నాయని చెప్పడం సులభమేనని, కానీ ఆ ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని సూటిగా ప్రశ్నించారు. ముడుపులు ఇచ్చిన అధికారి ఎవరో ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత ప్రజలు తిరస్కరించిన వాస్తవాన్ని అంగీకరించకుండా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కోదాడ అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు తీసుకువచ్చి పనులు చేపడుతున్నారని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అవసరమైతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.